సాక్షి పెద్దపల్లి

గురువారం | 24 | ఆగస్టు | 2023





సంబరాల్లో మునిగిపోయిన గోదావరిఖనిలోని సిమ్స్ అధ్యాపకులు, మెడికోలు





జిల్లాకేంద్రంలో సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు

గర్వంగా.. మురవంగా..

- జిల్లావ్యాప్తంగా చంద్రయాన్–3 సంబరాలు
- ఉత్కంఠగా వీక్షించిన ప్రజలు, విద్యార్థులు
- ఊరూవాడ ర్యాలీలు.. జాతీయజెండాతో వేడుకలు

చందమామను మన దేశగర్వం ముద్దాడిన వేళ.. మునివేళ్లపై నిల్చున్న భారతీయుడు ఎగిరి గంతేసిన వేళ.. నరాలు తెగే ఉత్కంఠ.. ఉద్విగ్న క్షణాల మధ్య చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం అయిన సందర్భంగా జిల్లావ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని అంటాయి. బుధవారం సాయంత్రం టీవీల వద్దే బంధీ అయిన జిల్లా ప్రజలు చంద్రయాన్–3 వ్యోమనౌక చందమామపై అడుగుపెట్టగానే సంబరాల్లో మునిగితేలారు. స్వీట్లు పంచిపెట్టుకుని, టపాసులు కాల్చారు. వివిధ పాఠశాలల విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీలు నిర్వహించారు. – జ్యోతినగర్/సుల్తానాబాద్/కోల్‌సిటీ/మంథని

గర్వకారణం



చంద్రయాన్–3 విజయాన్ని విద్యార్థులు టీవీల్లో వీక్షించారు. ఇది దేశం గర్వించదగిన క్షణం. తక్కువ బడ్జెట్‌తో.. స్వదేశీ పరిజ్ఞానంతో ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించి విజయం సాధించడం గర్వంగా ఉంది.

– రవినందన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి



మాటల్లో చెప్పలేని అద్భుతం



చంద్రయాన్–3 సక్సెస్ మాటల్లో చెప్పలేనిది. అదో అద్భుతం. అంతరిక్ష పరిశోధనలో భారత్ తనదైన ముద్రవేసింది. ప్రపంచంలో మన భారత్ ఇస్రో ప్రత్యేకతను చాటుకుంది. ప్రతి భారతీయుడు గర్వించదగిన రోజు ఇది.

– హిమబిందసింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్

కళ్ల ముందు కనబడింది



చంద్రయాన్–3 అపరూప దృశ్యాలను టీవీలో చూడడం కళ్లకు కనువిందు చేసింది. ఇలాంటి ప్రయోగాలతో మన శాస్త్రవేత్తల సత్తా తెల్సింది. మనదేశం ఖగోళ విజ్ఞానంలో మరో అడుగు ముందుకేసింది.

ఎం.సందీప్, ఎంపీసీ

శాస్త్రవేత్తల విజయం



శాస్త్రవేత్తల సమష్టి కృషితో ప్రపంచదేశాల మేధావులు భారత్ వైపు చూస్తున్నారు. ఇది నిజంగా గర్వించదగిన విజయం. ప్రపంచంలోనే దేశం సరి కొత్త అధ్యాయంగా చెప్పవచ్చు. భారత్ సరికొత్త చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖించింది. – సత్యప్రసాద్‌రాజ్, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ప్రిన్సిపాల్

ఆనందానికి అవధుల్లేవ్..



చంద్రయాన్–3 విజయవంతం కావడం గర్వంగా ఉంది. టీవీలో చూస్తున్నంతసేపు ఆ ఆనందమే వేరు. భవిష్యత్‌లో ఇటువంటి ప్రయోగాలు చేసి దేశకీర్తిని నలుమూలల చాటాలి.

– ఆర్.హర్షిత్, బైపీసీ, మంథని

శాస్త్రవేత్త కావాలనే ఆశ



చంద్రయాన్ విజయవంతం కోసం సైంటిస్టుల శ్రమ అనిర్వచనీయం. ప్రపంచ దేశంలో భారత సైంటిస్టుల గొప్పతనం పదిలమైంది. చంద్రయాన్ విజయవంతం కావడంతో భవిష్యత్తు సైంటిస్టు కావాలని ఆశ ఏర్పడింది.

–కే.సంజయ్‌రాము, పదో తరగతి, మంథని

సెల్యూట్ ఇస్రో



ఇస్రో సైంటిస్టులకు సెల్యూట్. ఇస్రో కొత్త రికార్డు సృష్టించింది. భారతీయుల గొప్పతనం మరోసారి ప్రపంచానికి తెలిసింది. ఇప్పుడు జాబిల్లి మాయమాటలు నిజం కాబోతున్నాయి.

– డాక్టర్ అనంతబాబు, సిమ్స్ ప్రొఫెసర్

గొప్ప అనుభూతి



చంద్రయాన్ ప్రయోగాన్ని జాబిలిపై దించడాన్ని ప్రత్యక్షంగా వీక్షించడం విద్యార్థులకు గొప్ప అనుభూతి కల్గింది. ఇలాంటి ప్రయోగాలను విద్యార్థులు చూడటం ద్వారా వారిలో ఉన్న మేధశక్తి బయటపడే అవకాలున్నాయి.

– స్వప్న, కేజీబీవీ ప్రిన్సిపాల్ భూపతిపూర్

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీధర్‌బాబు

రామగిరి: రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. వివిధ సంఘాలకు చెందిన సుమారు 100 మంది కాంట్రాక్ట్ కార్మికులు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. వారసత్వ ఉద్యోగాల విషయంలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, గనులను ప్రైవేట్ పరం చేస్తున్నారని తెలిపారు. గతంలో లక్ష మంది కార్మికులుంటే ప్రస్తుతం 42వేలకు పడిపోయారని తెలిపారు. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతిఒక్కరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, ఐఎన్‌టీయూసీ నాయకులు కోట రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడితే విజయం మనదే..



మాట్లాడుతున్న దాసరి మనోహర్‌రెడ్డి

ఓదెల: రానున్న ఎన్నికల కోసం ఇప్పటి నుంచే కష్టపడితే విజయం మనదేనని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఓదెలలో బుధవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామాల్లో బూత్ కమిటీ సభ్యులు పకడ్బందీగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకాదేవి, మార్కెట్ వైస్ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డిపాల్గొన్నారు.

అవినీతిమయంగా బీఆర్‌ఎస్



ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్

గోదావరిఖని: బీఆర్‌ఎస్ పాలన అవినీతిమయంగా మారిందని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాకూర్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ దాసరి ఉమ, ఆమె భర్త సాంబమూర్తి బుధవారం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అవినీతి పెరిగిపోయిందని, ఉద్యోగాల పేరుతో రూ.కోట్లు దండుకున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనతో విసిగిపోయి కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. అదే డివిజన్‌కు చెందిన ఎండీ అలీ, చిలుముల సుధాకర్, బిట్ల బాలక్రిష్ణ, పల్లె పర్వతాలు, పడాల శంకర్ కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు మారెల్లి రాజిరెడ్డి, మహంకాళి స్వామి, గట్ల రమేష్, చుక్కల శ్రీనివాస్, రాజు, ముస్తాఫా, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

108 రోజుల 'అసెంబ్లీ' ఆట

- ఎన్నికల వేళ అన్ని పార్టీల అభ్యర్థుల ముందు ఖర్చుల కొండ
- ఇక నుంచి ప్రతి పండుగ బాధ్యత వారిదే..
- 'కోడ్' వచ్చేలోగా రూ.2, 3 కోట్లకుపైగా వదులుకోవాల్సిందే..
- ఓటర్లు, కార్యకర్తలు, నాయకులకు మొదలైన మర్యాదలు
- కేడర్ సహకారం, వెన్నుపోట్లపై భయాలు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: 108.. ఇది ఎమర్జెన్సీ అంబులెన్స్ నంబర్ కాదు.. అదేదో వ్రతం కోసం గుడి చుట్టూ చేసే ప్రదక్షిణలు కావు.. వచ్చే డిసెంబర్‌లో జరిగే ఎన్నికలకు కాస్త అటూ ఇటుగా ఉన్న రోజులు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేద్దామనుకుంటున్న అధికార, విపక్ష పార్టీల అభ్యర్థులు తమ కళ్ల ముందు మెదులుతున్న ఖర్చుల కొండను తలుచుకొని, బెంబేలెత్తుతున్నారు. అధికార బీఆర్‌ఎస్ ఎన్నికలకు సమరశంఖం పూరించడం, మరోవైపు మిగిలిన పార్టీల్లోనూ ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. కానీ ఎన్నికల్లో రానూరాను ఖర్చులు పెరుగుతుండటం అభ్యర్థులను కలవరపెడుతోంది. నామినేషన్, ప్రచారం, పోలింగ్ ఇవన్నీ ఒక ఎత్తయితే, దానికి ముందే ఎన్నికల వాతావరణం రావడంతో ఇటు కేడర్‌ను, అటు ప్రజలను ఆకట్టుకునేందుకు నేతలు రూ.లక్షలు కుమ్మరించాల్సిన పరిస్థితి. ఓటర్లు మొదలుకొని కార్యకర్త, నాయకుల వరకు ఇప్పటికే మర్యాదలు మొదలయ్యాయి.

వెళ్లాల్సిందే.. కట్నాలు చదివించాల్సిందే

ప్రతీ నియోజకవర్గంలో అన్ని రకాల కులాలు, మతాల ఓటర్లు ఉంటారు. మహిళలు, వృద్ధులు, యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, దివ్యాంగులు, వితంతువులు.. ఇలా అన్ని వర్గాల వారిని ఆకట్టుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యే ఆశావహులదే. ఇందుకు అధికార పార్టీ నుంచి ప్రతిపక్ష నాయకుల వరకు ఎవరూ అతీతులు కారు. దీంతో ఇకపై నియోజకవర్గంలో జరిగే ప్రతీ పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చావు, పుట్టుక, పుట్టిన రోజు, పెళ్లిరోజు, సారీ ఫంక్షన్, సంతాప సభ, సన్మానాలు, కులసంఘాల సమావేశం, ఆత్మీయ సమ్మేళనాలు, ఉద్యోగ విరమణల నుంచి గృహ ప్రవేశాల వరకు ప్రతి సందర్భానికీ వెళ్లాల్సిందే.. కట్నకానుకలు చదివించాల్సిందే.

డజన్‌కు పైగా పండుగలు

ఆగస్టు 25న వరలక్ష్మి వ్రతం, 31న రాఖీ, సెప్టెంబర్ 6న కృష్ణాష్టమి, 18న వినాయక చవితి, 28న వినాయక నిమజ్జనం/మిలాద్–ఉన్–నబీ, అక్టోబర్ 2న గాంధీ జయంతి, 23న సద్దుల బతుకమ్మ, 24న దసరా, నవంబర్ 13న దీపావళి, 14న బాలల దినోత్సవం, 27న కార్తీక పౌర్ణమి.. ఇలా ఎన్నికలు ముగిసేలోగా.. డజన్‌కు పైగా పండుగలను ప్రజలు గుర్తుంచుకునేలా జరిపే బాధ్యత అభ్యర్థులు, ఆశావహులదే.

'కోడ్' కూశాక అసలు ఆట

ఈ 108 రోజుల్లో కేడర్‌ను చూసుకునేందుకు రోజుకు రూ.లక్ష అయినా ఖర్చవుతుంది. ఇక దసరాకు కాస్త అటూఇటుగా ఎన్నికల కోడ్ వచ్చే అవకాశాలున్నాయి. అధికార పార్టీకి అంతోఇంతో పార్టీ నుంచి, వివిధ వర్గాల నుంచి ఆర్థిక సహకారం లభిస్తుంది. కానీ, ప్రతిపక్షాలకు ఆ అవకాశాలు చాలా తక్కువ. పోస్టర్లు, ప్రచారం, సభలు, సమావేశాలు, యాడ్స్, ఫ్లెక్సీలు, ఇంటింటి ప్రచారాలు, పాదయాత్రలు అంటూ ఎమ్మెల్యే అభ్యర్థులు, ఆశావహుల జేబులకు చిల్లులు పడేది ఈ సమయంలోనే. అటు తర్వాత చేసే ఖర్చు లెక్కలను ఎన్నికల సంఘానికి చెప్పాల్సి ఉంటుంది. బయటకు కనబడకుండా ఓటరు మహాశయులను ప్రసన్నం చేసుకునేందుకు పరిమితికి మించి ఖర్చు చేయాలి. అదే సమయంలో పక్కనే ఉంటూ వైరిపక్షాలకు సాయపడే వెన్నుపోటుదారులను తలచుకొని, నేతలు గుబులు పడుతున్నారు.

ఆస్తులు అమ్ముకునేందుకు సిద్ధం

జీవితంలో ఒక్కసారైనా ఎమ్మెల్యే కావాలనుకునే వారు, ఈసారి కాకుంటే ఇంకెప్పటికీ కాలేమన్న ఆలోచనలో ఉన్నవారు ఈసారి సర్వశక్తులు ఒడ్డేందుకు ముందుకు వస్తున్నారు. చివరికి పార్టీలో, నలుగురిలో తాము ధనవంతులమే అని చాటుకునేందుకు తమ ఆస్తులు అమ్మేందుకు, మరికొందరు కుదవపెట్టేందుకు సంసిద్ధులుగా ఉన్నారు. ఈ రోజుల్లో నాయకుడు బయటికి వచ్చాడంటే.. కనీసం నాలుగైదు కార్ల కాన్వాయ్ తప్పనిసరి. వాటిలో పెట్రోలు కొట్టించాలి. ప్రతీ కారులో ఐదారుగురు అనుచరులు, కాన్వాయ్ రాగానే జిందాబాద్‌లు కొట్టేందుకు కొందరు యువత, బైక్‌ల వెంట జెండాలు పట్టుకొని తిరిగే కార్యకర్తలు, మంగళహారతులు ఇచ్చేందుకు మహిళలు ఉండాలి. ప్రతీ నాయకుడు కనీసం 100 మందికి ఈ మూడు నెలలపాటు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు వేతనాలు ఇవ్వాల్సిన పరిస్థితి. ప్రతిరోజూ వారి వాహనాల్లో పెట్రోలు కొట్టించడం, భోజనాలు, చేతి ఖర్చులు, రాత్రిపూట రాచమర్యాదలు సరే సరి. ప్రతీ నాయకుడు ఎంత లేదన్నా రూ.2, 3 కోట్లకు పైగానే ఖర్చు చేయాల్సి ఉంటుంది.

మూడు పార్టీలు కుట్ర పన్నుతున్నాయి..

- అయినా ప్రజలకు తనపై నమ్మకం ఉంది
- ఐదేళ్లు కడుపులో పెట్టుకొని చూసుకుంటా
- మంథని బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు

మంథని: పేద కుటుంబం నుంచి వచ్చిన తాను పేదల కష్టాలు తీర్చుతుంటే ఓర్వలేని కాంగ్రెస్ ఇతర పార్టీలతో కలిసి తనపై కుట్ర చేస్తోందని, అయినా ప్రజల్లో తనపై విశ్వాసం ఉందని మంథని బీఆర్‌ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. ఆయన బుధవారం మంథనికి రాగా.. కమాన్‌పూర్ మండలం గొల్లపల్లి నుంచి మంథని వరకు మంగళహారతులు, బైక్‌ర్యాలీతో స్వాగతం పలికారు. మంథని వద్ద భారీ గజమాలతో సన్మానించారు. అంబేద్కర్ కూడలిలో మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నాయకులు తమ పార్టీలోని కొందరు అసమ్మతివాదులతో కలిసి తనపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నాయకులు కసాయి కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతారని తెలిపారు. ఆత్మగౌరవం, పేదల ఆకలితీర్చేందుకు అనేకమంది అడవిబాట పడితే ఈ ప్రాంత నాయకత్వం కారణంగా వందలాది మంది నేలకొరిగారని గుర్తు చేశారు. గతంలో ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన ప్రజలకు రుణపడి ఉంటానని, 2014 కంటే రెట్టింపు ఉత్సాహం కార్యకర్తలో కనిపిస్తోందని, వంద రోజులు తన కోసం కష్టపడితే ఐదేళ్లు కడుపులో పెట్టుకొని చూసుకుంటానని మధు తెలిపారు. జయశంకర్‌భూపాలపల్లి జెడ్పీ చైర్మన్ జక్కుశ్రీహర్షిణి, మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- రాజకీయ పార్టీలతో సమావేశం



ఓటర్ డ్రాఫ్ట్ జాబితా అందిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఓటరు జాబితా సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. పార్టీల ప్రతినిధులకు డ్రాఫ్ట్ ఓటర్ జాబితా హార్డ్‌కాపీ, సాఫ్ట్‌కాపీలను అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెండో ప్రత్యేక ఓటరు జాబితా సవరణను ఎన్నికల కమిషన్ చేపట్టిందని, అక్టోబర్ ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈనెల 21న డ్రాఫ్ట్ ఓటరు జాబితాను 6,78,587 ఓటర్లు, 635 సర్వీస్ ఓటర్లతో విడుదల చేశామని, సెప్టెంబర్ 19 వరకు అభ్యంతరాలు, ఓటరు దరఖాస్తులను స్వీకరిస్తామని, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తామని అన్నారు. అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సెప్టెంబర్ 28 లోపు పరిష్కరించి, అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్ల వివరాలు, ఈఆర్‌ఓలు, సహాయ ఈఆర్‌ఓలకు అందించాలని, వారితో కలిసి ఓటరు జాబితా పోలింగ్ కేంద్రాల వారిగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఉప్పు రాజ్‌కుమార్, కాంగ్రెస్ నుంచి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, సీపీఐ నుంచి ముత్యంరావు, బీజేపీ నుంచి సంపత్‌రావు, బీఎస్పీ నుంచి సత్తూరి అనిల్, టీడీపీ నుంచి అక్కపాక తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ధరణి సహాయ కేంద్రం తనిఖీ

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ధరణి సహాయక కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన మాడ్యూల్‌లలో దరఖాస్తు సమర్పించేలా పకడ్బందీగా గైడెన్స్ అందించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం దిశగా అధికారులు విధులు నిర్వహించాలని తెలిపారు. దరఖాస్తుదారులకు సరైన గైడెన్స్ అందించాలని సిబ్బందికి సూచించారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు ఉన్నారు.

విద్యా పెంపునకు ఉన్నతి

సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం ఉన్నతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో ఉన్నతిపై ప్రధానోపాధ్యాయులకు నిర్వహిస్తున్న మూడురోజుల శిక్షణను పరిశీలించారు. విద్యార్థులకు ప్రారంభంలోనే బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించి, సబ్జెక్టుల వారీగా నిర్దేశించిన సామర్థ్యాలు పరీక్షించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. డీఈఓ మాధవి, ఉన్నతి మానిటరింగ్ అధికారి షేక్, ప్రధానోపాధ్యాయులున్నారు.

యువతకు ఉపాధి లక్ష్యంగా సీపెట్‌లో శిక్షణ

జ్యోతినగర్: యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఎన్టీపీసీ రామగుండం సంస్థ ముందుకు సాగుతోందని ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. సీఎస్సార్ సీడీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో జరిగిన మెషిన్ ఆపరేటర్ అసిస్టెంట్ –ఇంజెక్షన్ మౌల్డింగ్ అండ్ బ్లో మౌల్డింగ్‌లో ఆరు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణపత్రాలు అందించారు. సంస్థ విద్యుత్ ఉత్పత్తితోపాటు ప్రభావిత, పునరావాస గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడంలో అగ్రభాగాన నిలిచిందన్నారు. అర్హులైన యువతకు తగిన ఉపాధి అందించే క్రమంలో శిక్షణ కోసం అవసరమైన సహాయం అందజేస్తుందని అన్నారు. ఏజీఎం(హెచ్‌వోహెచ్‌ఆర్) బి.జయ్‌కుమార్ సిక్దర్, సీపెట్ అధికారులు, శిక్షకులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో సీజీఎం

అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: రానున్న ఎన్నికల్లో మరోసారి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మరింత అగ్రగామిగా నిలుపుతానని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రూ.300కోట్లకుపైగా నిధులతో అభివృద్ధి చేపట్టామని, మెడికల్ కళాశాల, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు నిర్మాణాలను చేపట్టినట్లు పేర్కొన్నారు. టికెట్ ఆశించిన నాయకులు, కార్యకర్తలను కించపరిచేలా పోస్టులు పెట్టొద్దని కార్యకర్తలకు సూచించారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, జెడ్పీటీసీ అముల నారాయణ, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం

కోల్‌సిటీ: ప్రభుత్వ సంక్షేమ పథకం ప్రతిఇంటికీ చేరిందని ఎమ్మెల్యే చందర్ అన్నారు. వికలాంగులకు ఆసరా పింఛన్ రూ.3,016 నుంచి రూ.4,016కు పెంచిన ప్రొసీడింగ్‌లను మార్కండేయకాలనీలో లబ్ధిదారులకు అందించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్‌తో కలిసి పంపిణీ చేశారు. దూర ప్రాంతాల నుంచి రాలేనివారికి ఎక్కడికక్కడే పత్రాలు అందించాలని ఆదేశించారు. కార్పొరేటర్లు, కార్పొరేషన్ డెప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, సూపరింటెండెంట్ మనోహర్, ఎంపీడీఓలు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చల్లబడిన బీఆర్ఎస్ అసమ్మతి నేతలు

- మంత్రి కొప్పుల సమక్షంలో ఎమ్మెల్యేతో నాయకులు
- త్వరలో పూర్తిస్థాయి సమావేశం

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో బీ ఆర్ఎస్ అసమ్మతి నేతలు చల్లబడ్డారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను బుధవారం బేషరతుగా కలిశారు. స్థానిక ఎల్‌బీనగర్‌లోని దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు మంత్రి గోదావరిఖనికి వచ్చారు. టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, కేశోరాం కార్మిక నాయకుడు బయ్యపు మ నోహర్‌రెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య ఆలయానికి చేరుకు ని మంత్రిని శాలువాతో సన్మానించారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యేను కూడా సన్మానించాలని మంత్రి సూ చించారు. కొద్దిసేపు తటపటాయించినా.. సన్మానించడం కొసమెరుపు. త్వరలో భేటీ అయి అన్ని విషయాలు చర్చించుకుందామని మంత్రి వారికి వివరించారు. మాజీ మేయర్ తల్లి చనిపోగా దశదిన కర్మ కారణంగా రాలేకపోయారని, పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి హైదరాబాద్ వెళ్లారని సమాచారం. కందుల సంధ్యారాణి ఫోన్‌లో మాట్లాడుతూ రెండురోజుల్లో తన వైఖరి వెల్లడిస్తానని తెలిపారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి రూరల్: సీఎం ఓవర్ సీస్ పథకం కింద స్కాలర్‌షిప్‌నకు అర్హత కలిగిన మైనార్టీ విద్యార్థులు సెప్టెంబర్ 21లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మేరాజ్ మహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2023 నుంచి జూలై 31 వరకు విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు స్కాలర్ షిప్ మంజూరుకోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సెప్టెంబర్ 30 వరకు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

దళితులకు మూడెకరాల భూమి ఎక్కడ ?

సుల్తానాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి ఇస్తానన్న హామీ మర్చిందని పట్టణంలోని 6వ వార్డు యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి కిరణ్ ఆరోపించారు. బుధవారం మండలకేంద్రంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత బంధు, నిరుద్యోగ భృతి, ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచనమేరకు ఎస్సై విజేందర్, సీఐ జగదీశ్ కోరగా కిరణ్ వాటర్‌ట్యాంక్ దిగాడు.

డీసీఎం, ఆర్టీసీ బస్సు ఢీ..

సుల్తానాబాద్‌రూరల్: ఆర్టీసీ బస్సు, డీసీఎం ఢీకొన్న ఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును సుల్తానాబాద్ బస్టాండ్ వద్ద మంచిర్యాల వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి 'గంట' దరఖాస్తు

పెద్దపల్లి రూరల్: నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసేందుకు తనకు అవకాశం కల్పించాలని కోరుతూ బుధవారం దరఖాస్తు చేసినట్లు ఓదెల జెడ్పీటీసీ సభ్యుడు గంట రాములు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన సూచన మేరకు తాను దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

క్రీడాకారులకు కిట్లు

- మండలకేంద్రానికి చేరుకున్న సామగ్రి
- జిల్లాలో 255 క్రీడా ప్రాంగణాలు
- ఈనెల చివరిలోగా క్రీడాకారులకు అందించేందుకు ఏర్పాట్లు



ఎంపీడీవో కార్యాలయంలో క్రీడా సామగ్రిని భద్రపరుస్తున్న ఉద్యోగులు

సుల్తానాబాద్ : తెలంగాణ క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో యువతీ, యువకుల క్రీడా ప్రతిభ వెలికి తీసేందుకు గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ప్రతి క్రీడా ప్రాంగణానికి మూడు రకాల క్రీడలకు సంబంధించిన క్రీడా సామగ్రిని అందజేస్తోంది. జిల్లాల్లో ఇప్పటికే మండలకేంద్రాలకు పంపించగా గ్రామ పంచాయతీలకు అందించనున్నారు. యువజన సంఘాలు, ఔత్సాహికులైన యువతీ, యువకులకు అందించేందుకు అందుబాటులో ఉంచనున్నారు.

క్రీడా పరికరాలివే..
క్రికెట్, వాలీబాల్, నెట్, ఖోఖో,రింగ్‌బాల్ సంబంధించిన సామగ్రి, క్రికెట్, వాలీబాల్, స్కిప్పింగ్ తాడులు, డంబెల్స్, రెండు విజిల్స్, సైకిల్‌పంపు, స్టాప్ వాచ్, డిస్కస్‌త్రో, టీ షర్టులను క్రీడాకారులకు పంపిణీ చేయనున్నారు.

పూర్తయిన క్రీడా మైదానాలు..
జిల్లాలో పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపల్‌తో పాటు రామగుండం కార్పొరేషన్ పరిధిలో క్రీడా ప్రాంగణాలు మొత్తం 255 ఏర్పాటు చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని గతేడాది జూన్‌లో నిర్ణయించారు. సుమారు రూ.80 వేల నుంచి రూ.3 లక్షల వరకు తెలంగాణ క్రీడా మైదానాలకు ఖర్చు చేసి అభివృద్ధి పరిచి యువతకు అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికే దాదాపు మైదానాలు పూర్తిచేశారు. ప్రభుత్వ స్థలాలు, పాఠశాలల్లో ఎక్కువ స్థలం ఉన్న మైదానాలు ఏర్పాటు చేస్తున్నారు. కబడ్డీ, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేసేందుకు వీలున్న స్థలాలను అభివృద్ధి పరుస్తున్నారు. వాటికి రూ.25 వేల వరకు వెచ్చిస్తున్నారు. అన్నింటికీ కిట్స్ పంపిణీ చేయనున్నారు.

జిల్లాలో 255 ప్రాంగణాలు..
మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లేందుకు క్రీడాకారులకు పరికరాలు ఉపయోగపడతాయి. యువతీ, యువకులు క్రీడలపై ఆసక్తి ఉండి సామగ్రి లేకపోవడంతో నిరుపేద యువతీ యువకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీల్లో భద్రపరిచి యువకులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 255 ప్రాంగణాలుండగా క్రీడాకారులకు కిట్లు అందించనున్నారు. ప్రస్తుతం జిల్లాకు అందించగా వాటిని మండల పరిషత్ కార్యాలయంలో భద్రపరిచారు.

అన్ని గ్రామాల్లో పంపిణీ చేస్తాం



క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా సామగ్రిని అందజేస్తోంది. ఇప్పటికే కిట్లు మండలకేంద్రానికి చేరాయి. క్రికెట్ కిట్‌తో పాటు వాలీబాల్. ఖోఖో పలు రకాల క్రీడా సామగ్రిని వచ్చింది. ఈనెల చివరిలోగా అన్ని గ్రామాలకు పంపిణీ చేస్తాం.

బాలాజీ రావు, ఎంపీపీ

యువతను ప్రోత్సహించేందుకే



గ్రామీణ, పట్టణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా సామగ్రిని ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను వెలికితీసేందుకు కిట్లు అందించనుంది. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోంది. యువత క్రీడల్లో రాణించాలి

– పదాల అజయ్ గౌడ్, మాజీ సర్పంచ్, గర్రెపల్లి

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న అదనపు కలెక్టర్

పెద్దపల్లి రూరల్: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ అన్నారు. ఓదెల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ చూపగా బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విద్యార్థులను ఆయన అభినందించారు. ఈనెల 20న జాతీయస్థాయి కరాటే పోటీలు మంచిర్యాల జిల్లా మందమర్రిలోని పద్మశాలీ భవన్‌లో నిర్వహించారు. ఓదెల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన తేజస్విని అండర్ 13 బాలికల విభాగంలో ప్రథమ, ఎం.సాత్విక ద్వితీయ, అండర్ 17 విభాగంలో చందన ప్రథమ, అండర్ 12 బాలికల విభాగంలో ఎ.హరిక్షేత్ర ప్రథమ, ఎం.సౌజన్య ద్వితీయ, అండర్ 11 బాలికల విభాగంలో జి.శృతి ప్రథమ, ఎల్.శరణ్య ద్వితీయ, అండర్ 14 బాలుర విభాగంలో ఎం.తరుణ్ ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీవో మధు మోహన్, ఆశాడపు సారయ్య, పాఠశాల హెచ్ఎం శోభారాణి, విద్యా కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, కరాటే మాస్టర్లు సంపత్ కుమార్, కల్వల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో యాదవులకు ప్రాధాన్యమివ్వాలి


సభలో పాల్గొన్న నాయకులు

పెద్దపల్లిరూరల్: చట్టసభల్లో యాదవులకు అన్నిపార్టీలు సముచిత ప్రాధాన్యం కల్పించాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకులు శేఖర్, రాజారాం, గంట రాములు డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో బుధవారం మహాసభ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో యాదవుల ప్రాబల్యమున్న నియోజకవర్గాల్లో ప్రధాన రాజకీయ పార్టీలు యాదవ అభ్యర్థులకే పోటీచేసే అవకాశం కల్పించాలన్నారు. హక్కులను సాధనకు పోరాడతామన్నారు. నాయకులు ఓడెలు, మేకల మల్లేశం, మారం తిరుపతి, మల్లేశ్, నాగరాజు, పర్వతాలు, నర్సింహ, రవి, రాజ్‌కుమార్, మల్లయ్య, రాములు, మేకల కుమార్, కార్తీక్, ఫకీర్, సాగర్, నవీన్ తదితరులున్నారు.

ఎస్సై, ఏఎస్సై అభ్యర్థులకు వైద్య పరీక్షలు

- రాజన్న జోన్ డీఐజీ కే.రమేశ్‌నాయుడు


రమేశ్‌నాయుడు

కరీంనగర్‌క్రైం: పోలీసుశాఖలోని వివిధ విభాగాల్లో (సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, ఎస్పీఎఫ్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ జైలర్) ఎస్సై / ఏఎస్ఐ(ఫింగర్ ప్రింట్ బ్యూరో, కమ్యూనికేషన్) నియామకాలకు అర్హత సాధించిన జోన్–ఐఐఐ అభ్యర్థులకు ఈనెల 26 నుంచి 28వరకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని రాజన్న సిరిసిల్ల జోన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీఐజీ) కె.రమేశ్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ వైద్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. జోన్ నుంచి ఎంపికైన 45మంది అభ్యర్థులు వైద్యపరీక్షల నిమిత్తం ఈనెల 25న సాయంత్రం ఐదుగంటలకు కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని సీఏఆర్ ఏసీపీ/ఆర్ఐ అడ్మిన్ ఎదుట హాజరు కావాలని పేర్కొన్నారు.

సోమారపు సత్యనారాయణ హౌస్ అరెస్ట్


హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

ఫెర్టిలైజర్ సిటీ: సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాల వైఫల్యానికి వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపుతో బుధవారం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి వెళ్లకుండా మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ గౌతమినగర్‌లోని తన నివాసంలో పోలీసులు ముందస్తు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సోమారపు సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రుల పర్యటన ఉంటే ప్రతిపక్ష బీజేపీ నాయకులను ముందస్తు హౌస్ అరెస్టు చేయడం కేసీఆర్‌కే సాధ్యమన్నారు. ఉద్యమ సమయంలో దళితున్ని ముఖ్యమంత్రిని చేస్తామన్న సీఎం కేసీఆర్ హామీని మరిచారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

స్వప్నికకు ఘనస్వాగతం


విరంచి స్వప్నికతో తల్లిదండ్రులు, కోచ్

ధర్మపురి: అంతర్జాతీయ వేదికపై పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించి మన త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన రంగు విరంచి స్వప్నిక బుధవారం పట్టణానికి చేరుకున్నారు. ఈసందర్భంగా పట్టణవాసులు, అభిమానులు, క్రీడాకారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. పట్టణానికి చెందిన రంగు వెంకటరమణ – శ్రీలత దంపతుల కూతురు విరంచి స్వప్నిక ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు షార్జా(దుబాయి)లో జరిగిన ఆసియా యూనివర్సిటీ స్థాయి కప్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విషయం తెలిసిందే. వాటితో స్వస్థలానికి చేరుకున్న స్వప్నికకు యువకుల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భగంగా పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్వప్నికకు ప్రసంశం జల్లు కురిపించారు. పూలమాల, శాలువాతో సన్మానించారు. అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు, కోచ్ రాజేందర్‌ను వారు అభినందించారు.

అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన జీఎంలు

గోదావరిఖని: అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌ను రామగుండం రీజియన్‌లోని మూడు ఏరియాల జీఎంలు బుధవారం కలిశారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, భూఅనుమతులు తదితర విషయాలపై చర్చించారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ.సూర్యానారాయణ, ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులతో పాటు క్యాజువెల్, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేశ్ డిమాండ్ చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈనెల 27 వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నాయకులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, ఉపాధ్యక్షుడు బి. అశోక్, బుచ్చమ్మ. మొగిలి, రాజేందర్, పద్మ, రమేశ్, సదానందం, మోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్


బయోమెట్రిక్ ద్వారా హాజరు వేసుకుంటున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: ఇక నుంచి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేశారు. కరోనా కారణంగా బయోమెట్రిక్‌ను తాత్కాలికంగా నిలిపివేశామని, అధికారుల ఆదేశాల మేరకు ఏరియాలోని అన్ని డిపార్ట్‌మెంట్లలో బయోమెట్రిక్ అమలవుతోందని తెలిపారు. డీజీఎం పర్సనల్ సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, ఐటీ మేనేజర్ రాజేశ్, ఎస్టేట్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలి


సన్మానిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి : అప్రమత్తంగా ఉంటూ బొగ్గు ఉత్పత్తి , రవాణా లక్ష్యాలను అధిగమించాలని సీహెచ్‌పీ జీఎం నవీన్ కుమార్ అన్నారు. బుధవారం ఆర్జీ–3 ఏరియాలో పర్యటించారు. సీహెచ్‌పీలో నడుస్తున్న పనులు, నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన బొగ్గు రవాణా లక్ష్యాలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో బొగ్గు రవాణాకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. మొదటిసారి ఆర్జీ–3 ఏరియాకు వచ్చిన సీహెచ్‌పీ జీఎంను ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావు సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఏలిషా, ప్రాజెక్టు ఇంజినీర్లు ఆర్. శ్రీనివాస్, ఎం.నాగరాజు, అధికారులు ఆర్. కేశవ రావు, నాగేశ్వర్ రావు, నరసింహ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మెగా మెడికల్ క్యాంపులేవీ?

- ప్రభావిత గ్రామాల కోసం నిధుల కేటాయింపు
- రూ. 22 లక్షలకు వినియోగమైనవి రూ.7లక్షలే
- మళ్లీ క్యాంపుల కోసం సన్నద్ధం


వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు (ఫైల్)

గోదావరిఖని: మెగా మెడికల్ క్యాంపుల కోసం ప్రభావిత గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించారనే కారణంతో ప్రభావిత గ్రామాలకు పలు కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు జారీచేసింది. సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని వకీల్‌పల్లిగని విస్తరణలో భాగంగా ఈ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తోంది. ఇందుకు సింగరేణి యాజమాన్యం రూ.22లక్షలు కేటాయించింది. అల్లూరు, వీర్లపల్లి, న్యూమారేడుపాక, పెంచికల్‌పేట్ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. మొదటి దఫా మెడికల్ క్యాంపులు నిర్వహించింది. ఈ క్యాంపులకు రూ.7లక్షల వరకు నిధులు వినియోగమైనట్లు తెలుస్తోంది. అయితే అవి ఏమాత్రం ప్రయోజనకరంగా లేవని ప్రభావిత గ్రామాల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

మెగా మెడికల్ క్యాంపు నిర్వహించాలి
ఆర్జీ–2 ఏరియాలోని నాలుగు గ్రామాలకు కలిపి మెగా మెడికల్ క్యాంపు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. కాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు, మోకాలి చిప్ప ఆపరేషన్, గుండెజబ్బులు, తదితర పరీక్షలు క్యాంపులో నిర్వహించాలని కోరుతున్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తే ఉపయోగకరంగా ఉంటుందని తెలుపుతున్నారు. ప్రభావిత గ్రామాలకు అత్యాధునిక వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేట్ వైద్యం అందించాలి
సింగరేణి యాజమాన్యం మెగా మెడికల్ క్యాంపు ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని తెలుపుతున్నారు. మొక్కుబడిగా కాకుండా అందరికీ ఉపయోగపడేలా క్యాంపు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

కార్మిక కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం

- రూ.2 కోట్లతో మాతాశిశు సంక్షేమ కేంద్రం
- సింగరేణి ఆసుపత్రుల్లోనే మోకాలి చిప్ప మార్పిడి ఆపరేషన్

కెమిస్ట్రీ అనాలసిస్, మైక్రోబయోలజీ యంత్రాల ఏర్పాటు


హెచ్‌బీ1సీ యంత్రం


భూమిపూజ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్(పా) బలరాం

గోదావరిఖని(రామగుండం): అధునాత కార్పొరేట్ వైద్యాన్ని సింగరేణి ఏరియా ఆసుపత్రుల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. కార్పొరేట్ వైద్యం కోసం హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రులకు ఏటా రూ.వేల కోట్లు వెచ్చిస్తున్న నేపథ్యంలో దాన్ని తగ్గించేందుకు సింగరేణి ఏరియా ఆసుపత్రుల్లోనే అధునాతన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా రామగుండం సింగరేణి ఏరియా ఆసుపత్రిలో రూ.26లక్షలతో బయోకెమిస్ట్రీ అనాలిసిస్, రూ.27లక్షలతో మైక్రో బయోలజీ యంత్రాన్ని ఏర్పాటు చేసింది. అలాగే రూ.2కోట్లతో 50 పడకల కెపాసిటీ గల మాతాశిశు సంక్షేమ భవనాన్ని నిర్మిస్తోంది. కొవిడ్ గుణపాఠంతో ఆక్సిజన్ ప్లాంట్లను సొంతంగా నెలకొల్పిన యాజమాన్యం, మరిన్ని మందులను అందుబాటులోకి తీసుకవచ్చింది. డాక్టర్ల కొరత తీర్చేందుకు నూతనంగా డాక్టర్ల రిక్రూట్‌మెంట్‌ను ఇటీవల నిర్వహించింది. డయాలిసిస్, సీటీస్కాన్ తదితర యంత్రాలను ఏరియా ఆసుపత్రుల్లో సమకూర్చింది.

మాతాశిశు సంక్షేమ కేంద్రం
సింగరేణిలో యువ ఉద్యోగులు పెరిగిన నేపథ్యంతో ప్రసవాలు, చిన్నపిల్లల కోసం ప్రత్యేక వార్డులు నెలకొల్పాలని యాజమాన్యం నిర్ణయించింది. దీనిలో భాగంగా గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మాతా శిశుసంక్షేమ కేంద్ర భవన నిర్మాణానికి డైరెక్టర్(పా) బలరాం ఇటీవల భూమిపూజ చేశారు. రూ.2కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ భవనంలో 50 పడకలు ఏర్పాటు చేయనున్నారు. ఈ భవనంలో ఎంఐసీయూ, పీఐసీయూ, ఎన్ఐసీయూ, ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు.

డయాబెటిక్ పేషెంట్లకు..
డయాబెటిక్ పేషెంట్ల కోసం అత్యాధునిక యంత్రాన్ని యాజమాన్యం కొనుగోలు చేసింది. హెచ్1సీ మూడు నెలల డయాబెటిక్ తీరును నిర్ధారించే ఈయంత్రాన్ని రూ. 27లక్షలతో యాజమాన్యం కొనుగోలు చేసి ఏరియా ఆసుపత్రిలో అందుబాటులోకి తెచ్చింది.

బెక్‌మాన్ బయోకెమిస్ట్రీ
అమెరికన్ టెక్నాలజీతో తయారైన బెక్‌మాన్ బయోకెమిస్ట్రీ యంత్రాన్ని రూ.26లక్షలతో యాజమాన్యం కొనుగోలు చేసింది. ఈయంత్రం ద్వారా గంటకు 150 టెస్టులు చేసే వీలుంటుందని డాక్టర్లు చెబుతున్నారు. మరిన్ని అత్యాధునిక పరీక్షలు చేయవచ్చని పేర్కొంటున్నారు.

దశలవారీగా అన్ని ఏరియా ఆసుపత్రుల్లో..

కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని కార్మిక కుటుంబాలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యం. ఇప్పటికే అత్యాధునిక వైద్యాన్ని అందిస్తున్నారు. మోకాలిచిప్ప మార్పిడి ఆపరేషన్ కూడా సింగరేణి ఆసుపత్రుల్లో చేయాలని నిర్ణయించాం. దశలవారీగా అన్ని ఏరియా ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి.

– ఎస్.బలరాం, డైరెక్టర్(పా) సింగరేణి